## పెద్దకథ ప్రారంభం:

# నేను మామూలు మనిషిని

ఉన్నవ విజయలక్ష్మి



'సావిత్రి ఉత్తరం వ్రాసింది. సరళని హైదరాబాదు పంపించమని.'...... చేతిలోవున్న కాగితంవంక చూస్తూ అన్నారు శంకరంగారు.

మధ్యాహ్నం పదకొండు గంటల వేళ. పరుపులమీది దుప్పట్లూ దిండు గలేబులూ మారుస్తున్న పార్వతమ్మ ఆ పని ఆపి తల ఎత్తి భర్తవంక చూస్తూ,

'సరళని పంపించమనా.' అంది తెల్లబోతూ.

'అదెప్పుడూ హైదరాబాదు చూడలేదు— వచ్చే నెలలో ఎగ్జిబిషనూ అదీకూడ చూసి కొన్నాళ్లు సరదాగా ఇక్కడవుండి వస్తుంది. అంటూ వ్రాసిందిలే. వీలయితే నాలుగు రోజులు శలవుపెట్టి నన్ను తీసుకొచ్చి దిగబెట్టమంది. లేకపోతే ఇక్కడ ఫలానా రోజు రైలు ఎక్కిస్తున్నామని ముందుగా వ్రాస్తే, అక్కడ స్టేషనుకి వాళ్లు వచ్చి తీసుకువెళ్తారుట...'

'బాగానే వుంది.' వడబడమ వుత్తరానికి అర్థం ఏమిటో అంతుపట్టని దానిలా చూస్తూ పొడిగా అంది పార్వతమ్మ.

'బాగుండకపోవటానికేముంది ఇందులో— సరాయిచోటుకేం పంపటం లేదు మనం. మేనత్తగారింట్లో ఓ నెల్లాళ్ళపాటువుండి వస్తుంది — నా శలవింకా వారం రోజుల పాటు వుండనే వుంది. రేపు తీసుకువెళ్ళి దిగబెట్టి వస్తాను.' అన్నారు శంకరంగారు ఉత్తరం భార్యచేతికి అందిస్తూ.

ఆ తరువాత కాస్సేపు ఆ విషయమ్మై భార్యా భర్తలు తర్జన భర్జనలు పడ్డారు. మేనత్త వుత్తరం చదువుకున్న సరళకి కూడ తండ్రిలాగే అక్కడికి వెళ్ళి రావటంలో ఏదో న్యూనత వున్నట్లు అనిపించ లేదు. అందుకే వుత్సాహంగా ప్రయాణం అయింది.

ఒంట్లో కాస్త నలతగా వుండటంవల్ల, కాస్త విశ్రాంతిగా ఇంటిపట్టున కూర్చుందాం అని పదిహేను రోజులు శలవుపెట్టిన శంకరంగారు తన ఒంట్లో చికాకునికూడ లక్ష్యపెట్టకుండా మర్నాడే కూతుర్ని వెంటపెట్టుకుని హైదరాబాదు రైలు ఎక్కాడు.

* * *

సరళ హైదరాబాదువచ్చి నాలుగు రోజులయింది. రెండు రోజుల క్రిందటే శంకరంగారు ఇంటికి వెళ్ళిపోయారు.

'ఇది వచ్చి నాలుగు రోజులయినా ఊరు

చూడటం పడనేలేదు.' అంది సావిత్రమ్మ ఉదయం కొడుక్కి కాఫీ ఇస్తూ.

'నేనేదో తీసుకు వెళ్ళనట్టు మాట్లాడతావేమిటి? మామయ్య వుండగానే వెడదాం అంటే తనేమో తలనొప్పి అదీ అంటూ ఎక్కడికీ రానన్నాడు మరి.' నవ్వుతూ సరళవంక చూస్తూ కాఫీగ్లాసు అందుకున్నాడు మోహన్.

'పరేలే — అన్నయ్య కసలే ఒంట్లో బాగుండ లేదు. పైగా ప్రయాణం బడలిక — ఇవాళ సాయంకాలం సరళని తీసుకువెళ్ళి పబ్లిక్ గార్డెన్సూ, నౌబత్ పహాడూ చూపించి తీసుకురా.'

'ఇదుగో సరళా, ఇప్పుడు ఉదయం ఏడు గంటలయింది. సాయంకాలం అయిదు గంటలకి బయలుదేరుదాం — ఈ మధ్యలో నీ ముస్తాబుకి ఎంత టైముకావాలో...' మోహన్ నవ్వేస్తూంటే సరళ మూతి ముడుచుకుంది.

'అదేం గంటలు గంటలు అద్దంముందు నిలబడి ముస్తాబు చేసుకోదు. అయిదు నిముషాలలో తెమిలి తయారవుతుంది.' ఆపేక్షగా మేనగోడలివంక చూసుకుంటూ అంది సావిత్రమ్మ.

'నువ్వుకూడా రా. అందరం సరదాగా వెళ్దాం.' అంది సరళ.

'నేనిదివరకు చాలాసార్లు చూశాను— అయినా నాకంత ఓపిగ్గాలేదు.' తప్పించుకోబోయింది సావిత్రమ్మ.

'అదివరకు చూసినది మరోసారి చూడకూడదా ఏమిటి? పోనీ ఇవాళ రాలేకపోతే అందరం మరోనాడే వెళ్దాం' సరళ బలవంతం చేస్తూంటే సావిత్రమ్మ మరేం మాట్లాడలేదు.

మోహన్ ఏ భావం వ్యక్తం కానివ్వకుండా ఓసారి సరళవంక చూసి మళ్ళీ తలతిప్పి కాఫీ త్రాగటంలో మునిగిపోయాడు.

సాయంకాలం అయిదు గంటలు కావస్తూంటే సరళ జడవేసుకుని, మొహం కడుక్కుని వచ్చింది. తిలకం దిద్దుకుని బట్టలు మార్చుకుందాం అనుకుంటూంటే సావిత్రమ్మ పిలుపు వినిపించి గదిలోంచి ఇవతలకి వచ్చింది.

వీధిలోకి అమ్మకానికి వచ్చిన చేమంతి పువ్వుల చెండుకొని లోపలికివచ్చిన సావిత్రమ్మ మేనగోడలివంక తృప్తిగాచూసి ఆ చెండు తలలో తురిమింది అభిమానంగా.

మేనత్త అలా అలంకరిస్తూంటే సరళ మనస్సులోనుంచి కొన్ని సంవత్సరాల క్రిందటి సంఘటన తాలూకు నీడలు పరుచుకున్నాయి.

సరళకి పది ఏళ్ళప్పుడు — సంక్రాంతి పండుగనాడు — వాళ్ళ వూళ్ళో, సావిత్రమ్మ సరళకి జడనిండా చేమంతి పువ్వులు కుట్టింది. జడమీద పెద్దచెండు పెట్టింది. పండగనాడు సరదాగా పువ్వులజడ కుట్టించుకుని, కొత్తపరికిణీ జాకెట్టూతో ముస్తాబయిన సరళ అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని మురిసిపోతూ ఇంకా ఇంకా తృప్తితీరక మరో చిన్న అద్దం తలవెనక పెట్టుకుని పూలజడ అందాన్ని కూడ చూసుకోటంలో మునిగిపోయింది. మోహన్ వెనకనుండి ఎప్పుడు వచ్చాడో ఆపిల్ల గమనించలేదు. పండుగకి గుమ్మాలకి కట్టిన మామిడి తోరణంలోనుండి ఓరెమ్మ తీసి చటుక్కున సరళ తలలో గుచ్చుతూ,

'ఇప్పుడింకా బాగున్నావు.' అప్పుడు పకపక నవ్వుతూ. సరళకూడ నవ్వేసేయబోయింది గాని అక్కడేవున్న సావిత్రమ్మా వాళ్ళు నవ్వుతూంటే వుడుకుమోత్తనం వచ్చి, గబుక్కున మోహన్ షర్టు అంది పుచ్చుకుని. అతను పారిపోయేలోపునే ఆ మామిడి రెమ్మతో వీపుమీద నాలుగు వడ్డించింది.

'అయ్యో, నీ ఇల్లు బంగారంగానూ, వాడేదో హాస్యం చేస్తే అంత ఉడుక్కుంటున్నావు. రేపు పెళ్ళాయాకకూడ ఇలాగే మర్యాద చేస్తావా ఏమిటి?' అంది సావిత్రమ్మ నవ్వుతూనే

'ఛ, నేను బావనేం పెళ్ళిచేసుకోను' అంది సరళ రుసరుస లాడుతూ.

'నువ్వు చేసుకునేదేమిటే, నేనే నిన్ను; శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని ఎత్తుకుపోయినట్లు, తీసుకువెళ్ళిపోయి పెళ్ళిచేసేసుకుంటాను' అన్నాడు మోహన్ గుమ్మం దగ్గరే నిలబడి వెక్కిరిస్తూ.

'రుక్మిణీదేవి కబురు పంపితే వచ్చి తీసుకువెళ్ళాడేకాని శ్రీకృష్ణుడు బలవంతంగా ఏమీ ఆమెను తీసుకుపోలేదు.' ధీమాగా సమాధానం చెప్పింది ఫసు ఫారం తెలుగు పుస్తకంలో రుక్మిణీ కళ్యాణం పాఠం చదివిన సరళ...

ఆలోచిస్తూ చీర కట్టుకుంటున్న సరళ అదోలా నవ్వుకుంది.

'ఇంకా కాలేదుటే, చివరికి మీ బావ చెప్పినంత సేపు చేసేలా వున్నావు చీర సింగారించేసరికి!' అని సావిత్రమ్మ హాల్లోంచి ఓకేకపెట్టింతో గబగబ చీర అంచులు సరిచేసుకుని మరోసారి అద్దంలో చూసుకుని ఇవతలకి వచ్చింది.

ముగ్గురూ బయలుదేరి, చూడదలుచుకున్నవి చూసి రాత్రి ఏనిమిది గంటలకి తిరిగివచ్చారు.

* * *

మోహన్ ఉదయం ఏనిమిది గంటలకే భోజనం ముగించుకుని లేబరేటరీకి వెళ్ళిపోతాడు స్కూటరుమీద, అతను తిరిగి వచ్చేసరికి సాయంకాలం నాలుగు అవుతుంది. అప్పుడు మళ్ళీ స్నానం చేసి, ఫలహారం, కాఫీ ముగించుకుని ఏ స్నేహితు లింటికో క్లబ్బుకో వెళ్ళి రాత్రి ఎనిమిదింటికి వస్తాడు. ఏ సినీమాకో, బజారుకో వెళ్ళాల్సిన పనివుంటే తప్ప అతను సాయంకాలాలు ఇంట్లో వుండడు.

మేనమామవున్న రెండు రోజులూ ఆయనతో ఏవో ఖబుర్లుచెప్తూ ఆయన ఆరోగ్యం గురించి కనుక్కుంటూ ఇంటి పట్టునే వుండిపోయాడుకాని ఆయన వెళ్ళిపోయాక అతని దినచర్య యథాప్రకారం అయిపోయింది.

సరళ వచ్చి పదిహేను రోజులయింది. ఈ కాలంలో ఒకసారి నౌబత్ పహాడ్ అవీ చూపించటానికీ, మరోసారి సినీమాకి తీసుకు వెళ్ళటానికీ మాత్రం అతని సాయంకాలం ప్రోగ్రాం మార్చుకున్నాడు కాని మిగతా సాయంకాలాలు అతను ఇంటిపట్టున వున్నదే లేదు.

కొడుకు ప్రవర్తన ఇలాగే వుండవచ్చును అని ముందే వూహించిన సావిత్రమ్మకి అది అంత ఆశ్చర్యం అనిపించలేదుకాని బాధపడకుండా వుండటం మాత్రం ఆవిడకి సాధ్యంకాలేదు—లోలోపల నొచ్చుకుంటూనే మేనగోడలు చిన్నబుచ్చుకోకుండా పైకి నవ్వుతూ సరదాగా ఏవేవో ఖబుర్లు చెప్తూండేది.

మోహన్ కూడ ఉదయం లేబరేటరీకి వెళ్ళేదాకానూ ఆ తరువాత ఇంట్లో వున్నంతసేపూ సరళతో సరదాగానే మాట్లాడేవాడు. మధ్యమధ్య హాస్యాలుచేసేవాడు. నవ్వేవాడు. నవ్వించేవాడు — అయితే అతను ఎంత సరదాగా మాట్లాడినా ఎన్ని ఖబుర్లు చెప్పినా అతని అంతరంగంలో తను ఆశించిన భావం లీలామాత్రంగా కూడా వ్యక్తం కావటంలేదు అనిపించేది సరళకి. ఆ మార్పు ఎలా వచ్చిందో ఎప్పుడు

వచ్చిందో తెలుసుకోవాలని ఆ పల్లె మనస్సు ఆరాటపడిపోయేది ఒక్కోసారి.

తను వచ్చినదగ్గరనుండీ అత్తయ్య తన కేదో చెప్పాలనుకుంటుందని, చాలాసార్లు అది చెప్పటంకోసం దగ్గరగా వచ్చి, పెదవి చివరదాకా వచ్చినమాటని అంతలో మింగేసి చటుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోతోందని కూడా సరళ గ్రహించింది.

'ఏమిటత్తయ్యా ఏదో చెప్పాలని ఆరాట పడుతూ మళ్లీ అంతలోనే వెనక్కి తగ్గుతున్నావు' అని అడగాలని సరళకి కూడ చాలాసార్లే అనిపించింది. కాని, 'సరే ఎప్పుడో అప్పుడు అవిడే చెప్తుంది' అని సరిపెట్టుకుని వూరుకుంది.

అవాళ ఆదివారం.

'ఇవాళ ఎగ్జిబిషన్‌కి వెళ్దాం. నాలుగు రోజులయిందిగా అది మొదలయి. ఈపాటికి అన్ని దుకాణాలు తెరుస్తారు' అంది సావిత్రమ్మ మధ్యాహ్నం భోజనాలవేళ.

'ఇవాళ, ఆదివారం. చచ్చే రష్ వుంటుంది' అన్నాడు మోహన్ నెయ్యి వేసుకుంటూ.

'ఉంటే వుందిలే. ఎవ్వరూ రాకుండా మన ఒక్కరికోసం పెడతారా ఏమిటి ఇలాంటివి' విసుగ్గా సమాధానం చెప్పింది సావిత్రమ్మ.

సరళ ఫక్కుమని నవ్వి 'అది కాదత్తయ్యా, అంత రష్‌లో నువ్వు తప్పిపోతావేమోనని బావ భయం' అంది.

'అమ్మమాట కాదుగాని, నువ్వు తప్పిపోతావేమో, మళ్లీ వెతికి మామయ్యకి అప్పగించాలి కదా అని నా భయం.' అన్నాడు మోహన్ వెక్కిరింతగా.

సరళ మూతి ముడుచుకుంది.

'అది నాలా చదువూ సంధ్యా లేనిదా ఏమిటి, భయపడటానికి, నువ్వు వెతికే దాకా బిక్కుబిక్కుమంటూ కూర్చోటానికీను. రిక్షా చేయించుకుని చిన్నగా మనింటికి వచ్చేస్తుంది' అంది సావిత్రమ్మ.

'అలా చెప్పు అత్తయ్యా' అని సరళ గాంభీర్యం నటిస్తుంటే అందరూ నవ్వేశారు.

సాయంకాలం.

అందరూ తయారయి ఇంక తలుపులు తాళాలు వేసుకుని బయలుదేరుదాం అనుకుంటూంటే వీధి గుమ్మంలో స్కూటరు

# నేను హావుహాలుం...

ఆగింది. ఓ పాతికేళ్ల యువకుడు, ఇరవై ఏళ్ల అమ్మాయి లోపలికి వస్తుంటే మోహన్ వుత్సాహంగా ఎదురువెళ్లి సంతోషంగా ఆహ్వానించి లోపలికి తీసుకు వచ్చాడు.

'ఆంటీ, మీరంతా ఎక్కడికో వెళ్లే ప్రయత్నంలో వున్నట్టున్నారే ... మీ యింటికి చుట్టాలు వచ్చినట్టున్నారు' అంది ఆ అమ్మాయి సావిత్రమ్మతో గలగలా మాట్లాడేస్తూ.

'మా మేనగోడలు సరళ ఈ మధ్యే వచ్చింది' అని.

'ఈ అమ్మాయి మాలతి, వీళ్లన్నయ్యా, మీ బాబూ ఒక్కదగ్గరే పనిచేస్తారు. బాగా స్నేహం' అంటూ సరళతో సావిత్రమ్మకి వచ్చిన వాళ్లిద్దర్నీ పరిచయంచేస్తూ.

'ఎగ్జిబిషన్‌కి వెళ్లివద్దాం అని బయలు దేరబోతున్నాం. రండి కూర్చోండి' అంటూ మోహన్ ప్రక్కగదిలోకి దారితీశాడు.

'కావలిస్తే ఓ నిముషం కూర్చుంటాం

## దధ్యమృత సౌజా

కావలసినవి:—

| | | |
|---|---|---|
| పుల్లటి పెరుగు | — | 2000 గ్రాములు. |
| పటిక బెల్లం | — | 400 గ్రాములు |
| అల్లపు రసము | — | 30 గ్రాములు |
| శొంఠి చూర్ణము | — | 15 గ్రాములు |
| జీలకర్ర చూర్ణము | — | 15 గ్రాములు |
| ఏలకుల చూర్ణము | — | 5 గ్రాములు |
| పచ్చ కర్పూరము | — | 2 గ్రాములు. |

తయారు చేసే విధానం:—

కర్పూరం తప్ప మిగతా అన్నింటినీ కలిపి బాగా పిసికి పలుచని గుడ్డతో వడగట్టి, వడగట్టిన రసములో 2 గ్రాముల పచ్చ కర్పూరం చూర్ణమును కలిపి సీసాలో గాని, జాడీలోగాని భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ అరకప్పు పొద్దున త్రాగితే ఆరోగ్యకరము.

'దధ్యమృత సౌజా'ను ప్రతి నిత్యమూ సేవించడం వలన పైత్య వ్యాధులు హరించి రక్త పుష్టికి దోహదకారి అవుతుంది. మూత్ర కృచ్ఛ వ్యాధుల్ని, అరోచకాల్ని —. తగ్గిస్తుంది. వికారాల్ని పోగొట్టి బలాన్ని కలిగిస్తుంది.

—మూర్తిశ్రీ జయసౌజన్య

కాని, మాకోసం కాఫీ ప్రయత్నం అదీ మాత్రం చెయ్యకండి — రేపు మాలతి బర్త్‌డే పార్టీకి పిలుద్దామని వచ్చాం' అన్నాడు మూర్తి.

'కాఫీ కలపటం పెద్దపనా ఏమిటి, రెండు నిముషాల్లో అయిపోతుంది. మీరు మాట్లాడుతూ వుండండి' అంటూనే వంటగదివేపు వెళ్లబోయింది సావిత్రమ్మ.

'ప్లీజ్ — ఏమీ అనుకోకండి — ఇప్పుడేమీ తీసుకోగలిగే స్థితిలో లేం - మధ్యాహ్నం ఇంటిదగ్గరే దిట్టంగా టిఫినూ కాఫీ తీసుకుని బయలుదేరాం — ఆ తరువాత మా చెల్లాయి స్నేహితురాళ్ళ ఇళ్లలో ఓ దగ్గర కాఫీ, ఓ దగ్గర టీ, మరోదగ్గర నిమ్మరసం బలవంతాన్న ఎగబోశాం. వద్దు అంటే వినేవారు కాదు. ఆ విస్మారం భరించలేక తప్పనిసరిగా తీసుకోవాల్సి వచ్చింది' అని మూర్తి అంటూంటే

'అన్నిచోట్లా మర్యాదకి ఏదో ఒకటి తీసుకున్నవాళ్ళు మా ఇంట్లోనూ అలాగే తీసుకోండి' అన్నాడు మోహన్.

'లేదు మోహన్ — మరి బలవంతం చెయ్యకండి. ఇక్కడ మాకు ఆమాత్రం చనువు వుంది కనుకే స్వతంత్రంగా వద్దు అని చెప్పగలుగుతున్నాం...'

'ఇది మరీ బాగుంది — చనువూ స్వతంత్రం వున్నచోట ఏమీవద్దు అని చెప్పి కొత్తచోట మాత్రం వాళ్ళమాట చెల్లిస్తారన్నమాట' మోహన్ విస్మయంగా అన్నాడు.

'అంతేమరి — వాళ్ళ ఆతిథ్యాన్ని తిరస్కరించి వాళ్లనేదో అమర్యాద చేశాం అన్నట్లు అపార్థం చేసుకునేచోట తప్పని సరిగ తీసుకోవాలి. ఇంక మీ ఇంట్లో నంటావా, భోజనం వేళకి వచ్చి నేనూ అన్నం తింటాను అని కంచం పెట్టుకుని కూర్చునే చనువూవుంది. ఇప్పుడు నాకేమీ వద్దు నేను ఏమీ తీసుకోను అని నిర్మొహమాటంగా చెప్పగలిగే స్వతంత్రమూ వుంది.' అని మూర్తి అంటూంటే,

అందరూ నవ్వేశారు.

మరి కాస్సేపు కూర్చుని ఆ ఖబురూ ఈ ఖబురూ చెప్పి మూర్తి వెళ్తూ, 'ఆంటీ, రేపు మోహన్‌తో మీరుకూడ తప్పకుండా రావాలి.' అని సావిత్రమ్మకి చెప్పి, 'మీరు కూడ' అని సరళకి కూడ

చెప్పి అందరిదగ్గరా సెలవు పుచ్చుకుని అన్నగారి వెంటనడిచింది మాలతి... సావిత్రమ్మ, మోహన్ వాళ్లవెంట వెళ్లారు గేటుదాకా — మూర్తి మోహన్ ఆఫీసు విషయాలేవో మాట్లాడుకుంటూంటే సావిత్రమ్మ మాలతితో అంది.

'రేపు మీ ఇంట్లో పార్టీ హడావిడి అయిపోయాక, ఓరోజు మధ్యాహ్నం ఎప్పుడయినా రా' కాస్సేపు కూర్చుని సరళా నువ్వూ ఖబుర్లు చెప్పుకుందురు గాని.' అని.

'అలాగే తప్పకుండా వస్తాను.' అని ఆవిడకి సమాధానం చెప్పి మోహన్‌తోకూడ మరోసారి చెప్పి అన్నగారి వెనక స్కూటరు ఎక్కింది మాలతి.

తలుపుకు తాళంపెట్టి మోహన్ వాళ్లు ఎగ్జిబిషన్‌కి బయలుదేరారు.

క్రొత్తగా ఇలాంటి ప్రదర్శనాన్ని చూస్తున్న సరళకి ఒక్కొక్క షాపూ ఓపిగ్గా చూపిస్తూ, వింతలూ విశేషాలూ వర్ణించి చెప్తూ కొత్తస్థలంలో ఇంత పెద్ద జనంలో ఒక్క క్షణం తను కనుపించకపోతే సరళ భయపడిపోతుందేమో అన్నట్టు ఆమెని అంటిపెట్టుకునే వుంటున్నాడు మోహన్.

ఆసక్తిగా, ఆనందంగా ఆ ఎగ్జిబిషన్ అంతా చూస్తూ మధ్యమధ్య కుతూహలంగా అతన్ని ప్రశ్నలువేస్తూ, ప్రక్కన అత్తయ్యవుంది అన్నసంగతి మరచిపోయి

# నేను మావాళ్లు...

తట్టు అతనితోనే ఖబుర్లు చెప్తోంది సరళ.

కొడుకూ, మేనకోడలూ అలా ఒకరి ప్రక్కన ఒకరు నడుస్తూ సరదాగా ఖబుర్లు చెప్పుకుంటూంటే ముచ్చటగా వాళ్లనే చూస్తూ, ఏవేవో ఊహాలలో తేలిపోతూ ఇంచుమించు మౌనంగానే వాళ్లని అనుసరిస్తోంది సావిత్రమ్మ.

అందరూ బట్టల దుకాణాలదగ్గరికి వచ్చే సరికి ఆవిడ పాదాలు రక్కున ఆగిపోయాయి — ఆవిడ పిలుపు విని మోహన్, సరళ కూడ ఆగిపోయారు.

'ఈ షాపులో నీకు నచ్చిన చీర ఒకటి ఎంచుకో.' మేనకోడల్ని వుద్దేశించి అందావిడ.

'అబ్బె నాకిప్పుడు చీర ఎందుకూ ?' పుట్టెడు మొహమ్మాటం పడిపోయింది సరళ.

'మీ అమ్మా నాన్నా, నాకూ మోహన్‌కీ బట్టలూ అవీ ఇచ్చినప్పుడల్లా నేను తీసుకోలేదూ ?' ఎప్పుడయినా ఇలా వద్దన్నానా ?' సున్నితంగానే మందలించింది సావిత్రమ్మ.

సరళ ఇంకేమీ మాట్లాడలేదు. ముగ్గురూ షాపుదగ్గరగా వెళ్లి నిలబడ్డారు. మోహన్ చెప్పినమీదట షాపు కుర్రాడు రకరకాల చీరలు లోపలి అద్దాల్లోంచి కూడ తీసి మడతలు విప్పి, చీరనాణ్యాన్నీ మన్నికనీ, రంగునీ, అంచునీ కూడ వర్ణించి చెప్తూ గుట్టగా పడేస్తున్నాడు; ముగ్గురూ మౌనంగా చూస్తూ నిలబడ్డారు. కాస్సేపటి తరువాత సావిత్రమ్మ అంది. 'ఏమ్మా వీటిల్లో నీకె చీర నచ్చలేదా ?' అని.

'ఇంకా చాలా రకాలున్నాయి. చూడండి.' అన్నాడు షాపు యజమాని, నచ్చలేదు అన్నమాట ఆ అమ్మాయి నోటినుండి వచ్చేస్తుందేమో నన్నట్టు ఖంగారుగా.

అందులో ఏది తీసికోవాలో అసలు ఎంత ఖరీదులో తీసుకోవాలో నిర్ణయించుకోలేక బొమ్మలా నిలబడిపోయిన సరళ, ఆవిడ మాటతో కదిలి, 'నీ ఇష్టం అత్తయ్యా, నీకేది నచ్చితే అది నాకూ బాగనే వుంటుంది.' అంది.

'అయితే ఈ మబ్బురంగు చీర బాగుందేమో చూడు.' ముందున్న బట్టలలోంచి ఓ జపాన్ జార్జెట్‌చీర తీసింది సావిత్రమ్మ.

ఆచీర కొంగువివర చిన్న లేబిల్ మీద వున్న ధరచూసి బిత్తరపోయింది సరళ.


'ఇప్పుడింత ఖరీదైన చీర ఎందుకత్తయ్యా. సాదాది ఏదైనా కొనివ్వు.' అంది.

'చీర నచ్చిందేమో చెప్పమంటే. ఖరీదు సంగతి ఎవరడిగారు నిన్ను...ఏం, మోహన్ ఈ చీర బాగుండలేదా...'అని ఆవిడ అంటూంటే.

'దీనికంటె ఆ రంగు బాగుంటుందమ్మా సరళకి.' అన్నాడు మోహన్ దూరంగా వున్న చీరని తియ్యమని షాపు కుర్రాడికి చూపిస్తూ.

అస్తమిస్తున్న సూర్యబింబపు ఎరుపు రంగులో చుట్టూ బెత్తెడు వెడల్పున బంగారపు రంగులో చమ్కీ లతలూ పువ్వులూవున్న అంచు, చీరనిండా కూడ అక్కడా అక్కడా చిన్నచిన్న పువ్వులున్నాయి — అంతకుముందు సావిత్రమ్మ చూపించిన చీరకంటె మరో పదిహేను రూపాయలు ధర ఎక్కువే.

'ఇది నచ్చిందా ?' మాటవరసకి తల్లినీ, సరళనీ అడిగినట్టుందే కాని నిజంగా వాళ్ళ అభిప్రాయం తెలుసుకోవాలని అడిగినట్టులేదు ఆ వాడిధోరణి. అయినా బాగుండలేదు అనే ఆస్కారం లేకుండా ఆ ఇద్దరి కళ్లనీ ఆకర్షిస్తుంది ఆ చీర. ఇద్దరూ తృప్తిగా



తం పొగించారు — ఇంకాస్సేపు ఆగితే వాళ్ళు మనస్సు మార్చుకుంటారేమో, మరో షాపులో కూడ చూసివస్తామని వెళ్ళిపోతారేమో అనుకొని, వాళ్ళకి కాస్త వూపిరి తీసుకునే వ్యవధి అయినా ఇవ్వకుండా 'అమ్మగారికి ఈ చీర బాగుంటుంది సార్, దీనిమీదికి మేచింగ్ బ్లౌజ్‌పీస్ చూపించమంటారా' అంటూనే ఇన్ని జాకెట్టు గుడ్డలు తీసి ముందు పడేశాడు ఆ షాపులో కుర్రాడు. అందరూ కలిసి ఆ చీరరంగుకి సరిపోయిన జాకెట్టు బట్ట సెలక్టు చేశారు. రెండింటికీ బిల్లు చెల్లించి ప్యాకెట్లు తీసుకున్నాడు మోహన్. తరవాత తల్లిచేతికి ఇచ్చాడు, ముగ్గురూ యింటికి తిరిగివచ్చారు.

(ఇంకా ఉంది)



# పెద్దకథ:



(గత సంచిక తరువాయి)

మర్నాడు మధ్యాహ్నం సరళ మామూలుగా జడ అల్లుకుని మొహం కడుక్కుని బొట్టు పెట్టుకున్నాక,

'ఈ చీర కట్టుకో' అంది సావిత్రమ్మ చీర ప్యాకెట్టు సరళచేతి కందిస్తూ.

తను వూరికి వెళ్ళిపోయేరోజున ఆ చీరకి పసుపు పెట్టి ఇస్తుందేమో అనుకున్న [illegible]

ఆ మాటవిని తెల్లబోతూ, 'ఇప్పుడా' అంది.

'అవును. కట్టుకో—కాస్సేపటిలో కావ లాగానే మూర్తి వాళ్ళింటికి వెళ్తారుగా.'

'వాళ్ళెవ్వరూ నాకు తెలియదత్తయ్యా —కొత్తచోటికి వెళ్ళటం అంటే నాకేమిటో బిడియంగా వుంటుంది' మెల్లిగా అంది సరళ.

'కొత్తేమిటి? నిన్న ఆ అమ్మాయి [illegible]

కుండా తమ్మని మరీ మరీ చెప్పి వెళ్ళింది ...నువ్విలాగే సిగ్గుపడి రానంటావేమోనని మోహన్ ప్రొద్దుటే చెప్పి వెళ్ళాడు... అసలు మాలతి చాలా కలుపుగోలు మనిషి, మనింటికి వచ్చింది రెండుమూడుసార్లే అయినా నాతో ఎంతో చనువుగా అభి మానంగా మాట్లాడుతుంది. ఆ పిల్లతో కబుర్లు చెప్తుంటే నీకు కొత్తచోటుకి [illegible]

# నేసం మహామహాలం...

చెప్తూంటేనే వీధిలో స్కూటరు ఆపి మోహన్ లోపలికి వచ్చాడు.

'అదుగో వాడూ వచ్చేశాడు. నువ్వు త్వరగా తెములు. వాడు మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చేలోగా నేను కాస్త కాఫీ కలిపి తెస్తాను.' అని మరోసారి మేనగోడల్ని హెచ్చరించి వంట గదిలోకి వెళ్ళిపోయింది సావిత్రమ్మ.

స్కూటరుదిగి మోహన్‌వెంట లోపలికి వెళ్తూంటే సరళ కాళ్ళు తడబడ్డాయి. అసలు మొదటిసారిగా స్కూటరుమీద బావ వెనక కూర్చోటం అంటేనే ఆ అమ్మాయి కెలాగో అనిపించింది. 'నీకేం భయంలేదు. ఇవాళ కొత్త గనక కాస్త నెమ్మదిగానే తీసుకువెళ్తాడు లే.' అని సావిత్రమ్మ అభయం ఇచ్చి మరీ పంపించింది.

చివరికి ఎలాగో ఇల్లు చేరుకున్నాం అని స్కూటరు దిగి ధైర్యంగా వూపిరి పీల్చుకోబోతున్న తరుణంలో ఇక్కడ బర్తుడే పార్టీ సినిమాలలో చూపించే పార్టీలాగే వుంటుందేమో అన్న ఆలోచన వచ్చి సరళ మనస్సు ఎలాగో అయిపోయింది. అయినా పైకి ఏమీ అనకుండా అడుగులో అడుగులేసుకుంటూ మోహన్ వెంటే లోపలికి వెళ్ళింది.

వీధి గదిలోనే ఎదురయిన మూర్తి వీళ్ళని ఆదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్ళాడు.

లోపల హాల్లో మాలతి కాక మరో ఆరుగురు అమ్మాయిలున్నారు. అంతా కల్లమట్టూ కుర్చీలలో కూర్చుని ఖబుర్లు చెప్పుకుంటూంటే టేప్‌రికార్డరులో రవి శంకర్ సితార్ వాయిద్యం వింటున్నారు. వీళ్ళని చూడగానే మాలతి ఛెంగున లేచి వచ్చింది.

మోహన్ తనచేతిలో ప్యాకెట్టు ఆ అమ్మాయి కందిస్తూ శుభాకాంక్షలు చెప్పాడు. మాలతి మిలమిల మెరుస్తున్న కళ్ళతో అతనివంక చూస్తూ ప్యాకెట్టు అందుకుని కృతజ్ఞతలు చెప్పింది. ఆ తరువాత సరళ చెయ్యిపట్టుకుని తన స్నేహితురాళ్ళ దగ్గరికి తీసుకువెళ్ళి అందరికీ పరిచయం చేసింది— ఇంతలో వంటగదిలో ఏర్పాట్లు చూస్తున్న తల్లీ ఇవతలగదిలో వున్న తండ్రీ కూడ మోహన్ మాట విని వించి హాల్లోకి వచ్చారు. సరళని వాళ్ళ కూడ పరిచయం చేసింది మాలతి. కాస్సేపు ఆ ఖబురూ ఈ ఖబురూ చెప్పుకున్నాక మాలతి వంటగదిలోకి వెళ్ళి, అదివరకే తల్లి సర్దిపుంచిన ప్లేట్లు పట్టుకొచ్చి బల్లమీద పెట్టింది.

'రండి!' అంటూ అందర్నీ వచ్చి టిఫిన్ తీసుకోమని ఆహ్వానించింది మాలతి తల్లి.

ఇంకా ఎవరైనా వస్తారేమో వెయిట్ చేద్దాం.' అన్నాడు మోహన్.

'ఇంకెవ్వరినీ పిలవలేదు—మరీ దగ్గరి స్నేహితులని కొద్దిమందినే పిలిచాం. చాలా సింపుల్ పార్టీ' అన్నాడు మూర్తి.

ఎంతమంది వస్తారో, ఎంత ఆడంబరంగా అట్టహాసంగా వుంటుందో అనుకున్న సరళకి రవంత నిరాశే కలిగినట్లయింది. పైగా మాలతీ, ఆమె స్నేహితురాళ్ళూ కూడ సరళ వూహించినట్లు వింతగానూ అతిగానూ అలంకరించుకోలేదు. అందరూ వాళ్ళ అంతస్తుకీ అభిరుచికీ తగినట్లు చీరలూ జాకెట్లూ ధరించి వున్నారు.

అంతా సరదాగా ఖబుర్లు చెప్పుకుంటూ ఫలహారం చెయ్యటం మొదలు పెట్టారు.

మాలతి ప్రక్కన కూర్చున్న సరళ మౌనంగా మోహన్ మాటలని వింటూ అతన్ని పరీక్షగా గమనించసాగింది. అతను మూర్తితోనూ, వాళ్ళ అమ్మా నాన్నలతోనూ, కూడ చాలా చనువుగా మాట్లాడుతున్నాడు. కాని మాలతీ అతనూ మాట్లాడుకునే తీరునిబట్టి వాళ్ళిద్దరిమధ్యా కేవలం స్నేహం ఒకటే కాకుండా మరేదో ఆకర్షణ వుంది అనిపించింది సరళకి.

'అసలు బావకీ ఈ మూర్తికీ స్నేహం ఎప్పటినుండి. మాలతికీ ఇతనికీ వున్న పరిచయానికి నిర్వచనం ఏమిటి? బావ నన్ను కావాలని ఇక్కడికి ఎందుకు తీసుకవచ్చినట్లు? అత్తయ్యకి వాళ్ళ వ్యవహారం బొత్తిగా తెలియదా? తెలిసీకూడ నాకు అర్థం అయేలా చెప్పాలని ఇలా పంపించిందా? ఈ విషయం వాళ్ళ నోటితోనే చెప్పకుండా నన్ను ఎందుకిందులో ఇరికించినట్లు?' సరళ మస్తిష్కం అంతా ప్రశ్నలతో నిండిపోయింది, అంతరంగంలో వుడుకుమోత్తనం, ఉద్వేగం అలలు అలలుగా ఎగిరెగిరి పడసాగాయి—కావాలని ఇలా తీసుకవచ్చి తనని పరాభవించినంత బాధ కలిగింది. కాని భావాలలో ఏ ఒక్కటీ పైకి వ్యక్తం కాకుండా మాత్రం జాగ్రత్త పడింది.

'అదేమిటి? మీరసలు ఏమీ తినటం లేదు?' హఠాత్తుగా ప్రక్కనుండి వచ్చిన ప్రశ్నకి ఉలిక్కిపడింది.

'ఏమిటంత పరధ్యానంగా వున్నారు? మా ఖబుర్లు బోర్ కొట్టటంలేదుకదా?' మళ్ళీ మాలతే అడిగింది.

'అహ అదేంలేదు. ప్రొద్దుటినుండీ తల నొప్పిగా వుంది ఏం తినాలనిపించటంలేదు' నసిగేసింది సరళ ఆ మాత్రంగా కూడ వెలితిపడిపోయినందుకు సిగ్గుపడుతూ.

ఓరగా ఆ అమ్మాయివంక చూసిన మోహన్‌కి ఆ అమ్మాయి అంతరంగం అవగతం అయిపోయినట్లు అనిపించింది. ఆ వూహతో అతని అంతర్యం అదొక లాంటి హాయినీ తృప్తినీ అనుభవించింది. తరువాత కాఫీ కూడ తీసుకుని, మరి కాస్సేపు కూర్చుని, వచ్చినవాళ్ళంతా ఇళ్ళకు బయులుదేరారు.

* * *

మధ్యాహ్నం రెండుగంటలవేళ. వీధి తలుపు చప్పుడయితే సావిత్రమ్మ వెళ్ళి తలుపు తీసింది.

## "అన్నపూర్ణ"

కం. అబ్బ నీకెంత నిబ్బర మబ్బ
అధికార్పాటావేశాలేల కలిగెన్
అనూయత దగ్ధమవును
అజ్ఞాని, వృథా ప్రేలక వ్యర్థ నీ కెంత
శోషంబె.

కం. అబల, చంచల, చపల, చిత్త
అత్యంత క్రోధాగ్ని జ్వాలయొదహించు
నైచున్.
అత్యాచార నిమగ్నమై
అనుతాపములు, త్యజింపు మందు సర
స్వతి గిరినై.

కం. అణగ ద్రొక్కెద, అబల నెల్లన్
అపరిమిత మధుర మరాళి మృదు
హృదయున్
అణచి వైచెద ధావాగ్నిని
అరవులకు బెదర, ప్రచండ భక్తి తత్పరనై.

—శ్రీమతి సరస్వతీగిరి

'ఆంటీ, అవాళ మీకిచ్చిన మాట చెల్లించటంకోసం వచ్చాను' నవ్వుతూ అంటూ సావిత్రమ్మవెంటే లోపలికి వచ్చింది మాలతి.

ఆదరంగా ఆ అమ్మాయిని పలకరించి వాళ్ళ వెంట గదిలోకి దారితీసింది సరళ.

ముగ్గురూ ఖబుర్లలో పడ్డారు. సావిత్రమ్మ కావాలనే సంభాషణని మోహన్ చిన్నతనంవేపుకి మళ్ళించి చెప్పటం మొదలు పెట్టింది.

మోహన్‌కి ఏడాది నిండిందో లేదో వాళ్ళ నాన్నగారు పోయారు. మాది పెద్ద కుటుంబం. ఇద్దరు బావగార్లు తోటి కోడళ్ళూ మేమూ అందరం కలిసే వుండే వాళ్ళం. మా అత్తగారు అంతకుముందే ఎప్పుడో పోయారు; ఆ సంవత్సరమే మా మామగారు పోయారు. ఇంక ఆస్తి పంచేసుకుందాం అనుకుంటుండగా నాలుగు రోజులు జ్వరంవచ్చి హఠాత్తుగా మోహన్ వాళ్ళ నాన్నగారు పోయారు. దాంతో మా బావగార్లకి కాస్త దుర్బుద్ధిపుట్టింది. వాళ్ళకి బోలెడుమంది పిల్లలూ, పెద్ద సంసారాలూనూ, నాకు వీడొక్కడే—ఇంతఆస్తి దీనికెందుకు పోనివ్వాలి అనుకుని ఆస్తి పంపకం దగ్గరకి వచ్చేసరికి లేని అప్పులు, చెయ్యని ఖర్చులూ చూపించటం మొదలు పెట్టారు. ఆడదాన్ని ఆ విషయాలన్నీ నాకెలా తెలుస్తాయి ? మా ప్లీడరుగారికే అది అన్యాయం అనిపించి మా అన్నయ్యకి వుత్తరం వ్రాశారు—మావారు పోయినప్పుడు వచ్చినప్పుడు మా అన్నయ్యకీ ఆయనకీ పరిచయం అయింది. ఆ పరిచయంతోనే వున్న విషయం అంతా వ్రాశాాయన—అన్నయ్యవచ్చి చూశాడు. పరిస్థితంతా అర్థం అయింది—ఇది న్యాయంకాదు అని మెమ్మదిగా చెప్పిచూ మా బావగార్లు వినలేదు. చివరికి వ్యవహారం కోర్టుదాకా పోయింది... అలాంటి వాతావరణంలో నన్నూ పిల్లవాడినీ వదిలివుంచలేక అన్నయ్య మా ఇద్దరినీ తీసుకువచ్చేశాడు...కోర్టుకి ఎక్కిన విషయం రోజుల్లోనూ నెలల్లోనూ తేలుతుందా—మా ఆస్తిఅంతా మాచేతికి వచ్చేసరికి దాదాపు పది సంవత్సరాలు పట్టింది. ఈలోగా మాపోషణా, ఖర్చులూ అన్నీ అన్నయ్యనెత్తినే పడ్డాయి. అయినా అన్నయ్య గాని వదినగాని ఒక్కనాడు కూడ విసుక్కో-



లేదు. నన్ను నిరాదరణ చెయ్యలేదు. ఆనాడు వాళ్ళు అలా ఆదరించకపోతే నేను మా బావగార్లు దయా ధర్మం క్రింద ఇచ్చిందేదో తీసుకుని తృప్తిపడేదాన్ని. అప్పుడు మోహన్ ఏదో సామాన్యమైన చదువుతో సరిపుచ్చుకుని మామూలు గుమస్తా వుద్యోగంలో స్థిరపడి పోయేవాడు... అదంతా తలుచుకుంటూంటే నా కిప్పటికీ అన్నయ్యా వదినలపట్ల కృతజ్ఞతా భావంతో కళ్ళు చెమరుస్తుంటాయి. వాళ్ళ ప్రోత్సాహమే లేకపోతే మోహన్ బెనారస్‌వెళ్ళి ఇంజనీరింగు చదవటం ఆతరువాత ఈ వూళ్ళో ఈ వుద్యోగం దొరకటం ఏమీవుండేవికావు. వాళ్ళఋణం నేనీజన్మలో తీర్చుకోలేనని పిస్తుంది.

మోహన్‌కి అయిదేళ్ళప్పుడు ఈ సరళ పుట్టింది. ఇది పుట్టిననాడే వాడికి భార్య పుట్టింది అనుకున్నాం మేమందరం...దీనికి పన్నెండేళ్ళు వచ్చిందాకా ఇద్దరూ ఒక్క దగ్గరే పెరిగారు. చిన్నప్పటినుండీ ఒకరంటే ఒకరు ఎంతో అభిమానంగా ప్రేమగా వుండేవారు—మధ్య మధ్య చిలిపి కజ్జాలాడ కునేవారు. అలా గడిచిపోయింది వాళ్ళ చిన్నతనం—తరువాత వాడు చదువుకి బెనారస్ వెళ్ళిపోయినా ఏడాదికోసారి శలవలకి వచ్చేవాడు—వాడికి సరళ అంటే అపరిమితమైన అభిమానం. అత్తయ్యా మామయ్యా అంటే గౌరవమూ ఆప్యాయతా...మోహన్ ఇంజనీరింగు పూర్తయింది. సరళ చదువూ ఆ వూరిలో వున్నంతవరకు అయిపోయింది. ఆ ఏడే ఆ శుభకార్యం జరిపించేద్దామనుకున్నాం... ఉద్యోగం దొరకందే పెళ్ళేమిటి అన్నాడు వీడు—సరే పరీక్ష ప్యాసు కాగానే ఆట్టే ఆలశ్యం కాకుండానే ఈ వుద్యోగం దొరికింది. ఇంక ఈ మాఘమాసంలోనయినా ఆ మూడుముళ్ళూ వేయించేసేయాలి...' ఓసారి సరళవంకా మరోసారి మాలతి వంకా చూస్తూ వాళ్ళ మొహాలలో చెలరేగే భావాలని అర్థం చేసుకుంటూ తను చెప్ప దలచుకున్నదంతా ఏకబిగిని చెప్పేసింది సావిత్రమ్మ.

ఆవిడ చెప్పటం ఆపేసింది అన్నసంగతి కూడ గ్రహించుకోలేనట్లు బొమ్మల్లా కూర్చుండిపోయారు వాళ్ళిద్దరూ. ఇద్దరి మొహాలల్లోనూ అదొకలాంటి బాధ ఉదాసీనత తిష్ట వేసుకున్నాయి. అది చూస్తూ ఇంక మీ ఆలోచనలలో మీరుపడి. కొట్టుకోండి నాపని తీరిపోయింది అన్నట్లు 'కాఫీచేసి తీసుకొస్తా' అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది సావిత్రమ్మ.

అయిదునిమిషాలలో ఆవిడ కాఫీ కప్పులతో తిరిగి వచ్చేలోపున వాళ్ళిద్దరూ మర్యాదగ రెండుమాటలు మాట్లాడుకున్నా ముభావంగానే వుండిపోయారు. కాఫీత్రాగి 'ఇంక వెళ్తానండీ.' అంటూ లేచింది మాలతి.

'అప్పుడేనా, ఇంకాస్సేపు కూర్చో,' సావిత్రమ్మ మర్యాద చెయ్యబోయింది.

'లేదండి వెళ్ళాలి 'ఇంట్లో పనివుంది' అని ఆవిడకి సమాధానం చెప్పి, మీ పెళ్ళికి మీ తరఫునుండి కూడ శుభలేఖ పంపించటం మరచిపోకండి.' అని సరళతో చెప్పి వీధిలోకి దారితీసింది.

వచ్చేటప్పుడు ఎంత వుత్సాహంగా, లేడి పిల్లలా చెంగుచెంగున నడుచుకుంటూ వచ్చిందో వెళ్ళేటప్పుడు ఆపిల్ల అడుగులు అంతబరువుగా పడుతున్నాయి. కళ్ళలో తిరగబోతున్న నీళ్ళు తమ కంటపడకుండా మొహం ప్రక్కకి తిప్పేసుకుంది అని సావిత్రమ్మ సరళకూడ గ్రహించారు.

'దారిలో ఎక్కడయినా రిక్షా చేసుకుంటాను' అని చెప్పి ఆ అమ్మాయి గేటు దాటి నడచి వెడుతూంటే గేటుదగ్గరే నిలబడిపోయిన ఆ ఇద్దరికీ ఆ అమ్మాయి అంతరంగంలో చెలరేగుతున్న అలజడి అల్లకల్లోలం అర్థం చేసుకునే శక్తి తమకి లేదు అనిపించింది. అంతేకాదు మీ పెళ్ళికి ఆహ్వానం పంపించండి అన్నమాట ఏ వుద్దేశ్యంతో అన్నట్లు అని ఎవరికి వారే తర్కించుకుంటూ ఆమాట పైకి చెప్పుకోవటం ఇష్టంలేనట్లు మౌనంగా వుండిపోయారు.

ఇద్దరూ లోపలికి వచ్చారు; మరికాస్సేపు గడిచిపోయింది.

హఠాత్తుగా తలతిప్పి అలమారులో గడియారంవంక చూసిన సావిత్రమ్మ. 'మూడుదాటింది. నేనింక టిఫిన్ ప్రయత్నంలో పడతాను. నువ్వు జడా అదీ వేసుకుని బట్టలుమార్చుకో,' అంది.

సరళ కళ్ళు రెండూ వెడల్పు చేసుకుని అయోమయంగా మేనత్త వంక చూసింది. ఇవాళ అత్తయ్య మాట్లాడే తీరు చిత్రంగా అనిపించింది ఆ అమ్మాయికి. అది గ్రహించినదానిలా సరళ దగ్గరగా వచ్చి ఆపిల్ల వీపుమీద అనునయంగా నిమిరి మళ్లీ చెప్పటం మొదలుపెట్టింది.

'చూడు—కొద్దిరోజులుగా నేను ఎంత దిగులుతో కృంగిపోతున్నానో ఎవ్వరికీ తెలియదు...అప్పుడు పరీక్షలవగానే లగ్నం పెడతాం అంటే వుద్యోగం దొరకాలిఅని పట్టుపట్టాడుకదా—సరే ఉద్యోగం దొరికింది. అందులో చేరిననాడే ఈ మూర్తి పరిచయం అయాడు. అతని సహాయంవల్లే ఈ ఇల్లూ కుదిరింది. బావ వుత్తరం వ్రాయగానే మీనాన్న నన్ను తీసుకొచ్చి ఇక్కడ దిగవిడిచి వెళ్లాడు నీకూ తెలుసుగా ...ఆ వచ్చినప్పుడే మీనాన్న అడిగాడు మళ్లీ; పెళ్లిమాట. అంత తొందరేమిటి ఉద్యోగం పెర్మనెంటు కానీ అన్నాడు వీడు—సరే అన్నాం. రోజులు గడుస్తున్నాయి. మూర్తికీ వీడికి బాగా స్నేహం కలిసింది. తరుచు అతను మనింటికి వచ్చేవాడు వీడూ వాళ్లింటికి వెళ్లేవాడు. అక్కడే ఈ మాలతితో పరిచయం అయినట్టుంది. మొదట్లో నాకూ తెలియదు. అయితే నేను మళ్లీమళ్లీ పెళ్లిమాట ఎత్తినప్పుడు మాత్రం అదివరకులా మరి కొన్నాళ్లు ఆగమని అనకుండా ఎలాగో వుంటూ వచ్చాడు—ఉద్యోగం పెర్మనెంటు కూడ అయిపోయింది. ఇంకా అభ్యంతరం ఏమిటి అని ఆమధ్య మీనాన్న వ్రాసిన వుత్తరానికి ఏం సమాధానం వ్రాయమన్నావు అని ఎంత అడిగినా ఏదో చెప్పి తప్పించుకున్నాడే కాని నాకు సరి అయిన మాట చెప్పలేదు... అంతేకాదు మనం ఇక్కడికి వచ్చి రెండేళ్లు కావస్తోంది ఒకసారి సెలవుపెట్టి మామయ్యగారి వూరు వెళ్లివద్దాం అని ఎన్నిసార్లు చెప్పినా చెవిని పెట్టలేదు...వాళ్ల వుత్తరాలకి సరిఅయిన సమాధానం వ్రాయటంలేదనీ పెళ్లి విషయంలో జాప్యం చేస్తున్నామనీ అన్నయ్యకీ వదినకీ నామీద చిరాకుగా వుంటోందని నాకు తెలుసు. కాని ఏం చెయ్యను. ఎలాచెప్పను. అసలు నాకే అనుమానంగా వున్న విషయం ఇంకొకరిముందు ఎలా బయటపెట్టను—వీడి ధోరణీ; పెళ్లిమాట చెప్తే మొహం ముడుచుకోటం చూసి నాలో నేనే మథనపడిపోతుండేదాన్ని.


చివరికి ఏమనుకున్నాడో రెండుసెలల క్రిందట ఓరోజు మూర్తినీ మాలతినీ వెంటబెట్టుకు వచ్చాడు. మూర్తి అదివరకు చాలాసార్లు మనింటికి వచ్చాడు, నాతో చనువు మర్యాదగా మాట్లాడుతూంటాడు.

'మా చెల్లాయి' మాలతి. బియ్యే ప్యాసయింది మొన్ననే' అంటూ అతనే నాకు ఆ అమ్మాయిని పరిచయం చేశాడు. కాస్సేపు కూర్చుని కాఫీ అదీ తీసుకుని వెళ్లిపోయాడు. తరువాత పదిరోజులకే మళ్లీ ఇంకోసారి వచ్చాడు. మొదటిసారే నాకు కొంచెం అనుమానం కలిగింది. రెండోసారితో అది రూఢీఅయింది. అలగని ఇక్కడ వాళ్లిద్దరూ పకపకలూ వికవికలూ అవీ ఏం లేవనుకో. కాని ఏమిటో ఈ అమ్మాయిని దృష్టిలో పెట్టుకునే మొదటి నుండీ అనుకుంటున్న సంబంధం పట్ల విముఖత పెంచుకున్నాడనిపించింది-నాకెందుకో వెర్రిబాధ వచ్చింది. ఈ మాలతిలో ఎంచతగ్గలోపం వుందనికాదు—చిన్నప్పటినుండి ఆశ్పఆశలు పెంచుకున్న నీకు అన్యాయం జరుగుతుందే అని బాధపడ్డాను. అన్నాళ్లు దగ్గర పెట్టుకుని అన్నివిధాల ఆదరించిన అన్నయ్యా వదినల పట్ల కనీసం కృతజ్ఞత అయినా చూపించుకునే అవకాశం పోగొట్టుకుంటున్నాం అనిపించేది—నాలుగురోజులు అహోరాత్రాలు ఆలోచించాను—చివరికి నీచేతేవాడిని అడిగిస్తే, ఏం సమాధానం చెప్తాడో చూద్దామనిపించింది—అందుకే నిన్ను పంపించమని వ్రాశాను...నా ఆలోచనలో తప్పు ఏమీ నాకు కనిపించటంలేదు. చిన్నప్పటినుండి కలిసి పెరిగారు కలిసి తిరిగారు. జ్ఞానం వచ్చిన దగ్గరనుండి ఒకరి మనసు ఒకరు ఇచ్చి పుచ్చుకున్నారు – ఇవాళ వాడు అదంతా మరిచిపోయి అదోలాంటి వ్యామోహంలోపడిపోతూంటే వాడిని మళ్లీ నివాడిని చేసుకునే హక్కు నీకువుంది...'

మేనత్తమాటలు వింటూ సరళ చటుక్కున తల తిప్పుకుంది. రోషంతోనూ అవమానంతోనూ ఆ పిల్ల కనుకొలుకులు చమర్చాయి.

'నువ్వు ఈ గొడవ లేపి ఎత్తవద్దు. 'నీ దగ్గరనుండి ఎంతకీ వుత్తరం రాకపోవటంతో నాన్న నాకు మరో సంబంధం చూడాలనుకుంటున్నారు' అని చెప్పి దానికి వాడేం సమాధానం చెప్తాడో విను. ఇంక తరువాత ఏం మాట్లాడతావో నీ ఇష్టం— అయినా నీ అంతట నువ్వు మనస్సు విప్పి మాట్లాడితే కాదనే స్థితికి వాడింకా రాలేదనే నా నమ్మకం...' సావిత్రమ్మ మాటలు ముగియకుండానే గుమ్మందగ్గర స్కూటరు శబ్దం వినవచ్చింది.

'అడుగో వాడువచ్చాడు— నేనింకా కాఫీ టిఫినూ చెయ్యనేలేదు...నువ్వు కాస్త మొహం కడుక్కురా...' అని హడావిడిగా చెప్తూ తలుపు తియ్యటానికి వెళ్లింది.



కాస్సేపటి తరువాత కాఫీ గ్లాసుతో గది లోకి వచ్చిన సరళని చూసి, 'అదేమిటి ఇక్కడికెందుకు తెచ్చావు. నేనే వంట గది లోకివచ్చి త్రాగేవాడినిగా'..అన్నాడు మోహన్.

'అసలే ఆలస్యం అయిపోయింది అని అత్తయ్య ఇచ్చి రమ్మంది' అంది సరళ కాఫీ గ్లాసు బల్లమీద పెడుతూ.

'అలా వున్నావేం' కాఫీ గ్లాసు నోటి ముందు పెట్టుకోబోతూ సరళ మొహం లోకి చూస్తూ అన్నాడు.

'ఎలావున్నాను' అని నవ్వుతూ ఎదురు ప్రశ్నవేసి, 'నేనింక యింటికి వెళ్ళిపోతాను. నాలుగురోజుల్లో నన్ను పంపించేసెయి' అంది.

'అమ్మకి చెప్పావా?'

'లేదు. చెప్తాను' అంది తలవంచుకుని బల్లమీది పుస్తకాలు సర్దుతూ.

కాస్సేపటి తరువాత ఖాళీ గ్లాసు తీసుకుని ఇవతలకివచ్చిన మేనగోడలిని ఒళ్ళంతా కళ్ళుచేసుకుని చూసింది సావిత్రమ్మ.

తను ఆశించిం మార్పేమీ కనిపించలేదు ఆ పిల్ల మొహంలో మరో పదినిముషాల్లో మోహన్ బయటికి వెళ్ళిపోయాక.

'ఏమన్నాడే' అని అడిగింది వుండబట్ట లేక.

'చాలా బాగుందిట.'

'ఏమిటి బాగుంది?'

'కాఫీ.'

'నా నెత్తి—నేను అడగమన్న మాట అడగలేదూ' బాధగా, చిరాగ్గా ఆ పిల్ల వంక చూసింది.

'లేదత్తయ్యా' అనేసి ఆవిడ మరోమాట అనే అవకాశం ఇవ్వకుండా మరో గదిలోకి వెళ్ళిపోయింది సరళ.

* * *

మర్నాడు రాత్రి తొమ్మిదిగంటలు కావస్తోంది. సాయంకాలం షికారుకని బయలు దేరిన మోహన్ యింకా ఇంటికి రాలేదు.

'ఇవాళ ఇంత ఆలశ్యం అయిందేమిటో, ఎప్పుడూ ఎనిమిదిగంటలకల్లా వచ్చేసే వాడు' అంది సావిత్రమ్మ గడియారం వంక చూస్తూ.

'సినిమాకి వెళ్ళాడేమో' అంది సరళ.

'ముందుగా చెప్పకుండా అలా వెళ్ళడు.'

'ఏమో ఏ స్నేహితుడైనా బలవంతం చేస్తే వెళ్ళాడేమో.'

'అయితే ఇంకా అరగంటపైనే అవు తుంది. వాడు రావటానికి పోనీ ఉన్నారా,

# నేను మహామహాలు..

అన్నం తిందువుగాని...'

'ఎందుకత్తయ్యా—బావని కూడా రానీ, ఏకంగా ముగ్గురం తిందాం.'

వాళ్ళు అలా మాట్లాడుకుంటుండగానే మోహన్ వచ్చాడు.

'సినిమాకి వెళ్ళావేమో—ఇంకో అరగంట దాకా రావనుకుంటున్నాం' అంటున్న సావిత్రమ్మ కొడుకు మొహం చూసి గతుక్కు మంది. అతని మొహం జేవురించివుంది.

కళ్ళు రోషావమానాలతో కణకణ లాడి పోతున్నాయి.

సావిత్రమ్మ ఏదో అడుగుదామనుకునే లోపలే అతను గదిలోకి వెళ్ళిపోయాడు. తరువాత బట్టలు మార్చుకుని బాత్ రూమ్ లోకి వెళ్ళి కాళ్ళూ ముఖం కడుక్కు వచ్చాడు.

ఈలోగా సరళ వంటగదిలో ముగ్గురికీ కంచాలూ మంచినీళ్ళూ పెట్టింది సావిత్రమ్మ వడ్డనకి ప్రక్రమించింది.

అతను ఎంతకీ రాకపోవటంతో 'వడ్డిం చేశామురా' అని ఓ కేక పెట్టింది అక్క డ్నుంచే.

'నాకు ఆకలిలేదు—మీరు తినండి' గది లోంచే సమాధానం చెప్పాడు మోహన్.

సావిత్రమ్మా సరళ మొహామొహాలు చూసుకున్నారు.

'వాడు అసలు ఎలాగోవున్నాడు. ఏం జరిగిందో కనుక్కువస్తాను' అని లేచి వెళ్ళింది సావిత్రమ్మ.

మోహన్ రగ్గు ముసుగు పెట్టుకుని పడు కున్నాడు. ఆవిడ రగ్గు కాస్త వత్తిగించి అతని నుదిటిమీద చెయ్యివేసి చూస్తుంటే,

'నాకేం జ్వరం రాలేదు'అన్నాడు మోహన్ కాస్త విసుగ్గా.

'మరి. ఆకలెందుకులేదు.'

'ఇందాకా హోటల్ టిఫిన్ తిన్నాను— ఇంకిప్పుడన్నంవద్దు.'

'ఎంతో వద్దు. కాస్త మజ్జిగ అన్నం తిను.'

'అబ్బ—నన్ను విసిగించకమ్మా—నాకేం వద్దని చెప్పటంలే' కొడుకు కంఠంలోని కరకుదనానికి విస్తుపోయిందావిడ.

'నువ్వు టిఫిన్ తినటం. ఆకలివెయ్యక పోవటం ఇవేవీ నిజంకాదు...ఎందుకిలా వున్నావు. నాతో చెప్పకూడదా.'

**తల్లి (అతిమానుతున్న కొడుకు మోహన్**

తిరాకు మరో దిక్కూలేదయింది. అయినా కొన్ని తమాయించుకుని,

'నేనిప్పుడేమీ చెప్పలేను—నన్ను మాట్లా డించకు. వెళ్ళు—సరళ కని పెట్టుకుని వుంటుంది. మీరిద్దరూ అన్నం తినండి.' అనేసి ప్రక్కకి ఒత్తిగిలిపడుకున్నాడు.

చిన్నబోయిన మొహంతో వంటగదిలోకి వెళ్ళిపోయిందావిడ.

'వాడికి ఆకలిలేదుటమ్మా—ఏమిటో దిలాగో వున్నాడు. నాకూ ఏం తినాలనిపిం చటంలేదు—నువ్వు తిను' అంటూ రెండు కంచాలలో ఆధరవులు మళ్ళీ గిన్నెలో వెయ్య సేయబోతుంటే.

'నాకూ తినాలనిలేదు. నా కంచంకూడా తీసేయి' అంటూ పీటమీదనుండీ లేచి పోయింది సరళ.

అప్పటికి సావిత్రమ్మకి తనుచేసిన పొర బాటు తెలిసివచ్చింది—మనస్సులో ఏదో పెట్టుకుని తల్లీ కొడుకులు వస్తుంటే ఇంటూంటే చుట్టం చూపుగావచ్చిన పిల్ల భోజనం ఆరగిస్తూ కూర్చుంటుందా.

'నువ్వు లేవకు. నేనూ తింటాను' అని గబగబా తన కంచంలోనూ సరళ కంచం లోనూ అన్నం వడ్డించింది ఆవిడ.

ఇద్దరూ ఏదో తిన్నామనిపించి చేతులు కడుక్కున్నారు. ఆ రాత్రి ముగ్గురూ సరిగ్గా నిద్రపోలేదు. అయితే తెల వారి లేచిన మోహన్ మొహం ఎప్పటిలా ప్రశాం తంగా వుండటం గమనించి ఆ ఇద్దరూ తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు.

ఆవాళ ఆదివారం. అందుచేత హడా విడిగా ఉదయం ఎనిమిదిగంటలకే వంట చెయ్యాల్సిన పనిలేదు.

క్రితం రాత్రి సంఘటన గురించి అడగ కుండా ఇంకేవో కబుర్లుచెప్తూ తాపీగా వంట ముగించింది సావిత్రమ్మ. పదకొండు గంటలవేళ అందరూ తృప్తిగా భోజనం చేశారు

తరువాత మోహన్ తన గదిలోకి వెళ్ళి పోయాడు. సరళ పుస్తకం చదువుకుంటూ మధ్య గదిలో కూర్చుంది. సావిత్రమ్మ వంట గది సర్దుకునివచ్చి సరళ ప్రక్కన చాపమీద నడుంవాల్చింది. చదువుకుంటూ కూర్చున్న సరళకి రాత్రి నిద్రలేకపోవ టంతో కళ్ళుమూరుకు రాసాగాయి. పుస్తకం ప్రక్కన పడేసి మేనత్త ప్రక్కనే చోటు చేసుకుని పడుకుంది.

**(ముగింపు వచ్చేవారం)**

పెద్దకథ:

# నేను మామూలు మనిషిని



ఉన్నవ విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

కాస్త కునుకు తీసి లేచిన సావిత్రమ్మ టైము ఇంకా ఒంటిగంటే అవటంతో అప్పటికప్పుడు చేసేపని ఏమీలేక ఇంత ప్రత్తి తెచ్చుకుని, విడదీసి దీపారాధనకి వత్తులు చేసుకుంటూ కూర్చుంది.

మరోగంటకి మోహన్ లేచి ఇవతలకి వచ్చాడు. నిద్రమత్తు వదిలిపోయేలా చన్నీళ్లతో మొహం కడుక్కురావటానికి అతను బాత్‌రూమ్‌వేపు వెళుతూంటే సావిత్రమ్మ చేతిలో సరంజామా అంతా ఎత్తిపెట్టి, ఫలహారం ఏదీ తయారు చెయ్యటానికి వంటగదిలోకి వెళ్ళింది.

మోహన్ టవల్‌తో మొహం తుడుచుకుంటూ వంటగదిలోకి వెళ్ళాడు. పకోడీలు చెయ్యటానికి ఉల్లిపాయలూ పచ్చిమిరపకాయలూ తరుగుతోంది సావిత్రమ్మ. మోహన్ తల్లి ప్రక్కనే పీటవాల్చుకుని కూర్చున్నాడు.

సరళ ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కళ్ళు తెరిచింది. 'నిన్న మాలతి మనింటికి వచ్చిందిటకదూ' మోహన్ మాట వినిపించి సరళమత్తు వదిలిపోయింది. చటుక్కున లేచి రెండడుగులు వేసి గుమ్మందాటి వంట గదిలోకి వెళ్ళాలనిపించింది—కాని తనువెళ్తే బావ చెప్పటం మానేస్తాడేమో అనుకుని, అతను చెప్పేది వినాలనే పట్టుదలతో

అక్కడే కదలకుండా పడుకుని కళ్లు మూసుకుంది నిద్రనటిస్తూ.

'అవును. వచ్చింది—నీకెవరు చెప్పారు.' గుంభనంగా అడిగింది సావిత్రమ్మ.

'నాతో చాలా మాట్లాడాలనీ సాయంకాలం ఓసారి తప్పకుండా వాళ్లింటికి రమ్మనమనీ మూర్తిచేత ఉదయం కబురు పంపించింది.' తనకీ మాలతికిగల స్నేహాన్ని గూర్చి మొట్టమొదటిసారిగా తల్లితో చెప్తున్న మోహన్ గొంతులో అదోకలాంటి ఒదుగు వ్యక్తం అయింది.

'నువ్వు ఏవేవో చాలా విషయాలు చెప్తావుటకదూ' తల్లి ఏమంటుందో వినాలన్నట్లు తను చెప్పటం ఆపాడు.

సావిత్రమ్మ ఏమీ సమాధానం చెప్పలేదు. కొద్దిక్షణాలు మౌనంగావుండి మళ్లీ మోహనే మొదలుపెట్టాడు.

'నేను ఈవూరు వచ్చేదాకా సరళని పెళ్లిచేసుకోవాలనే మనస్ఫూర్తిగా కోరుకున్నాను — చదువయిపోగానే మామయ్య లగ్నం పెట్టిస్తానంటే వుద్యోగం వచ్చేదాకా ఆగమని చెప్పినప్పుడుకూడ నాకు మరో అభిప్రాయం లేదు. అయితే ఇక్కడికివచ్చి ఉద్యోగంలో చేరిన మొదటిరోజే మూర్తి వెంట వాళ్లింటికివెళ్లి అక్కడ మాలతిని చూసినప్పుడుమాత్రం నా మనస్సు ఏదోగా అయిపోయింది. క్రమంగా ఆ అమ్మాయితో స్నేహం పెంచుకుని మామయ్య ఉత్తరాలకి ఏవో సాకులుచెప్పి తప్పించుకుంటూండేవాడిని. రాను రాను నీవత్తిడికూడ ఎక్కువయ్యింది. నేనయినా ఈ ముసుగులో వ్యవహారం ఇంక ఎంతోకాలం కొనసాగించకుండా తేల్చిచెప్పేద్దామనుకున్నాను. అందుకే అవాళ మాలతిని మనింటికి తీసుకురమ్మన్నాను. రెండుమూడుసార్లు అలా వచ్చాక నీకు తనమీద మంచి అభిప్రాయం ఏర్పడ్డాక తనవిషయం చెప్పాలనుకున్నాను. నన్ను అల్లుడిగా చేసుకోటం ఆ యింట్లో అందరికీ అంగీకారమే — మామయ్యకీ, సరళకీ ఏం సమాధానం చెప్పాలి అనే సంశయం ఒక్కటి తప్పితే నీకు అంగీకారం కాకపోవటానికి తగిన కారణం ఏదీ లేదు. మాలతిమీద మంచి అభిప్రాయమూ, అభిమానమూ ఏర్పడ్డాక నా కోర్కె బయటపెట్టి నిన్ను ఒప్పించటం ఏమంత కష్టం అయినపని కాదనుకున్నాను...నీకు, మామయ్య కుటుంబంపట్లా సరళపట్లా నేను వూహించినదానికంటే ఎక్కువ గౌరవం అభిమానమూ వున్నాయని తరవాత గ్రహించుకున్నాను. లేకపోతే నా మనస్సు ఓ ప్రక్కనుండి కాస్త కాస్త అర్థం అవుతూనేవున్నాకూడ అలా హఠాత్తుగా వుత్తరం వ్రాసి సరళని పిలిపించవు. సరే సరళని తీసుకుని మామయ్య వచ్చాడు. ఆయన వున్న రెండురోజుల్లోనూ ఈ పెళ్లి ప్రస్తావన వచ్చినా నేను అదివరకు లాగే తప్పించుకున్నాను. ఇంక సరళకి అసలువిషయం చెప్పేయాలి. లేకపోతే నీచేత చెప్పించాలి అనుకుంటుండగా మాలతి పుట్టినరోజు పిలుపు వచ్చింది. అవాళ కావాలనే తననీ బలవంతంగా ప్రయాణం చేయించాను. తను నా మనసు అర్థం చేసుకుంటుంది ఇంక ఆమెకి చెప్పటం కష్టం కాదు అనుకున్నా. ఇవాళో రేపో నీతో ఈ విషయాలు ముచ్చటించాలనుకుంటుండగానే మాలతి నిన్న మనింటికి రావటం సరళగురించి తెలుసుకోటం జరిగిపోయింది.' మోహన్ గొంతులో ఎలాంటి ఉద్వేగమూ బాధా కనిపించటంలేదు. చాలా సహజంగా మాట్లాడేస్తున్నాడు.

'అవును. తనకీ విషయాలన్నీ చెప్పాలనే ఒకసారి మనింటికి కాస్త సావకాశంగా రమ్మనమని నేను చెప్పాను అవాళ పుట్టినరోజు పార్టీకి పిలవటానికి వచ్చినప్పుడు.' సావిత్రమ్మ గొంతు గంభీరంగా వుంది.


'అవునుట... సరే సంగతంతా తెలుసుకున్న మాలతి ఇప్పుడు ఏమంటుందో తెలుసా ?'

'ఏమంది ?' సావిత్రమ్మ గొంతులో వణుకు కనిపించనీయకుండా ప్రశ్నించింది— కాని సరళ కంపిస్తున్న అంతరంగంతో చెవులురిక్కించుకుని మోహన్ సమాధానం కోసం ఎదురు చూడసాగింది.

'మీరిద్దరూ మేనత్త మేనమామ బిడ్డలు ఒకరికోసమే మరొకరు పుట్టినట్టు పసితనంనుండి అన్యోన్యంగా పెరిగారు— ఇన్నాళ్ల తరువాత ఇవాళ హఠాత్తుగా నాతో పరిచయం అయి ఆ అమ్మాయికి అన్యాయం చేస్తాననటం ధర్మంకాదు— చిన్నతనంనుండి ఆశలు పెంచుకున్న సరళనే చేసుకోండి. నన్ను మరిచిపోండి అంది ... ఇలా చెప్పటానికి నీకేమీ బాధ అనిపించటంలేదా అని అడిగాను— నేను. మాలతి చెమరుస్తున్న కళ్లు ఒత్తుకుని మళ్లీ చెప్పటం మొదలుపెట్టింది. మనకి పరిచయం అయి కొద్దికాలమే అయినా, మనం స్నేహం పేరిట అతిచనువుతో ప్రవర్తించకపోయినా ఒకరి మనసు ఒకరికి తెలుసు. నేను ఎన్నో బంగారు కలలు కన్నాను. మరెన్నో వూహాలోకాలలో విహరించాను. నా కలలు నిజం అయేరోజుకోసం ఎదురు చూస్తున్నాను. ఇంతలో మీ విషయాలన్నీ తెలిశాయి. అవి వినగానే భరించలేనంత బాధకలిగిన మాట నిజమే. కాని నిదానంగా ఆలోచించిన మీదట నా కర్తవ్యం ఏమిటో తెలిసి వచ్చింది. మనం స్నేహితులంగానే విడిపోదాం అంది. నేను నచ్చచెప్పాను. నా పెళ్లి విషయంలో అన్నినిర్ణయాలూ నావే. ఇందులో మరొకరి ప్రమేయంలేదు అని ఎన్నోవిధాల చెప్పాను. కాని మాలతి వినలేదు. తనపట్టు విడవలేదు. అంతేకాదు 'మీరు ఇంతగా చెప్పక్కర్లేదు, ఇవాళ నేను మిమ్మల్ని వదల్లేను అని ఒక్కమాట అంటే చాలు మీరు ఎంతమందినయినాసరే ఎదిరించి నా మెడలోనే తాళికడతారని నాకు తెలుసు. కాని నా సంతోషంకోసం. నా సుఖం కోసం మరో అమ్మాయి ఆశలని కూలదోసే స్వార్థం నాలో లేదు.' అంది. తను అంత నిష్కర్షగా చెప్తూంటే ఆ సమయంలో నాలో ఎంతటి దుఃఖమూ. మీ అందరిమీదా చిరాకూ కోపం కలిగాయో నేను మాటలలో చెప్పలేను. అలాంటిస్థితిలోనే యింటికి తిరిగివచ్చాను. అన్నం తినాలనిపించలేదు. నిద్రపట్టలేదు. రాత్రంతా ఒకటే ఆలోచన. ఒకటే తపన. చివరికి తెలతెల్లవారుతూండగా ఒక నిర్ణయానికి రాగలిగాను...మాలతి సూచించిన పరిష్కారం ఎంతో వుత్తమంగా వుంది అనిపించింది...'

'నిజం మోహన్.' తను వింటున్నది తనకే నమ్మశక్యం కానంత విస్మయంలోనుండి చటుక్కున తేరుకుని అపరిమితమయిన సంతోష సంభ్రమాలతో అంది సావిత్రమ్మ. 'మాలతి చిన్నపిల్ల అయినా దొడ్డగుణం కలది. ఆ అమ్మాయిని మొదట నేనూ అర్థం చేసుకోలేకపోయాను. అయినా చెప్పి చూద్దామనిపించి అన్ని విషయాలూ తెలియజేశాను... అదే మరొకరయితే చిన్నవాడు లక్షమాటలనుకుంటాం అవన్నీ

## మీకు సంతానం లేదా?



ఆపరేషను, ముట్టు వ్యాధులచేను, ఎకట్లచే, నిరాశచెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే, దేశములో పల్లు ప్రాంతముల స్త్రీలు, సంతానవతులై పంపిన ప్రశంసా పత్రములు అనేకము గలవు. **ఉచిత సలహా.** వివరములకు:


**శ్రీనాగార్జున మూలికా కుటీరం**

రైల్వే స్టేషన్ వద్ద — రామాలయముల వీధి,

**తెనాలి - 2.**

## గోల్డ్ సైట్ పిల్స్

బంగారు మాత్ర



సిద్ధ, ఆయుర్వేదములో ప్రఖ్యాతమైన తయారు. ఇవి గోల్పోయిన శక్తి, ధాతుబల హీనత, వీర్య బలహీనత, నరముల బలహీనతను పోగొట్టి మీకు కుటుంబసుఖం, జీవిత సుఖం ఇచ్చేదానికి - మాత్రకు ఏది సమం లేదు. చాలమంది నుండి బహుమతులు పొంది వున్నది. మీరు నేడే వాడండి. 100 మాత్రలు రు. 37—50. 50 మాత్రలు: రు. 20. పోస్టేజి రు. 3/— ముందుగా డబ్బు పంపవలెను. 50 మాత్రలకు తక్కువ పంపబడవు.

Karthikeya Vaidyasala
Falani P. O.
Madurai Dt. (Tamil Nadu)

# నేను మహామహులం...

అక్షరాలా పాటించాలనే రూలు ఎక్కడుంది అంటూ భీష్మించుకుని కూర్చునేవారు. తననే పెళ్ళి చేసుకోమని నన్ను బ్రతిమాలుకొనేవారు. తను పట్టు నెగ్గించుకోటం కోసం ఏడుపులూ అలిగి కూర్చోటాలూ అన్నీ చేసేవారు. కాని మాలతి పరిస్థితి అంతా అర్థంచేసుకుని నీకే ఆవిధంగా నచ్చ చెప్పింది అంటే ఆ పిల్ల వివేకం ఎంత వున్నతస్థాయిలో వుందో అర్థం అవుతోంది.' ఆవిడ మాటల్లో గొంతులో మాలతిపట్ల అభిమానమూ సదభిప్రాయమూ పొంగి పొర్లుతున్నాయి.

'అవునమ్మా, తను మనసారా కోరుకున్న గానిని మరొకరికోసం త్యాగం చెయ్యగలగటం మాలతిలాంటి వాళ్ళకే సాధ్యం అవుతుంది ... పసితనంనుండే మీరంతా ఏవేవో అంటూవుంటే ఆ తెలిసీ తెలియని వయస్సులోనే అమాయకంగా సరళపట్ల మమతని పెంచుకున్నాను... మనస్సు వికసించాక, మాలతిని చూశాక నాకు ఏది కావాలో తెలిసినట్లనిపించింది. ఆ సంగతే మాలతికి కూడ చెప్పాను. కాని తను అంతగా చెప్పినమీదట. తరువాత ఆలోచిస్తే పెద్దయాక ఏర్పడిన ఆకర్షణ కంటె, చిన్ననాటి చెలిమికి మమతకీ ప్రాధాన్యం ఇవ్వాలనిపిస్తోంది— మామయ్య మనకిచేసిన సహాయానికి కనీసం కృతజ్ఞత చూపించుకోవటం, అమాయకంగా ఆశలు అల్లుకున్న సరళ మనస్సు గాయపడకుండా చూడటం. ఇది నా కర్తవ్యం అనిపిస్తోంది.' అని మోహన్ అంటూంటే,

'ఇవాళే మామయ్యకి వుత్తరం వ్రాయి. శుభకార్యం పెట్టించమని.' అంది సావిత్రమ్మ, ఆవిడ గొంతులో కొడుకు నిర్ణయంపట్ల సంతోషం. ఇంకా ఆలస్యంచేస్తే అబ్బాయి మళ్ళీ మనస్సు మార్చుకుంటాడేమోననే ఆదుర్దా వ్యక్తం అయాయి.

'నేనా — నేను వ్రాస్తే ఏం బాగుంటుంది. నువ్వే వ్రాయి' అన్నాడు మోహన్. అతని గొంతులోని ఒదుగుకి నవ్వుకుంది సరళ.

'పోనీ నేనే వ్రాస్తానులే — సరేకాని, సరళ హాల్లో నిద్రపోతోంది. మన మాటలకి మెళుకువ రాలేదుకదా?' ఆ అమ్మాయికి అన్ని విషయాలు తెలియటం బాగుండదేమో' అన్న సందేహంతో ఆవిడ అంటూంటే,

'మెళుకువ వచ్చి విన్నాకూడ మనం మాట్లాడుకున్నదాంట్లో తప్పేమీ లేదు— తనకి వినిపించకపోయినా ఏదో ఒకనాడు అన్ని సంగతులూ నేనే తనకి చెప్దామనుకుంటున్నాను' అన్నాడు మోహన్.

చాలాసేపటి తరువాత, అతను కాఫీ త్రాగి గదిలోకి వెళ్ళిపోయాడనిపించాక సరళ లేచి బాత్‌రూంలోకి వెళ్ళి, మొహం కడుక్కొని వచ్చింది.

ఆ అమ్మాయిచేతికి కాఫీ గ్లాసుతోపాటు తను అంతకితమే వ్రాసివుంచిన వుత్తరం కూడ అందించింది సావిత్రమ్మ.

ఉత్తరం చదువుకుని కాగితం మడిచి ఆవిడచేతికిస్తూ, 'నేను రేపు మావూరికి వెళ్ళిపోతా నత్తయ్యా, నన్ను పంపించేసేయి' అంది సరళ.

'అదేం?' తెల్లబోతూ ఆ అమ్మాయి వంక చూసిందావిడ.

సరళ కళ్ళు వాల్చుకుని, తలవంచుకుని కాఫీ త్రాగుతూ వుండిపోయింది.

'పిచ్చి పిల్లా. ఇంతట్లో ఎంత సిగ్గు ముంచుకు వచ్చిందే.' అంటూ వాత్సల్యం తొణికిసలాడుతున్న కళ్ళతో అపురూపంగా మేనగోడలిని చూసుకుంటూ, ఆదరంగా ఆపిల్ల తలనిమురుతూ, 'సరే, అలాగే వెళ్ళు. మళ్ళీ నెలనాటికి కొత్త కోడలిగా ఈ ఇంట్లో అడుగు పెడుదువుగాని.' అంది.

సరళ మాట్లాడకుండా ఖాళీగ్లాసు ప్రక్కనపెట్టి లేచివచ్చి స్టౌ ముందు కూర్చోబోతూంటే,

'ఇప్పట్నుంచి నీకెందుకే ఆ బెడద ఈ నాలుగు పకోడీలు నేను చెయ్యగలనులే. నువ్వు తలదువ్వుకో—రేపు ఎలాగా వెళ్ళిపోతా నంటున్నావు. ఇవాళ సినిమా అయినా చూసి వద్దురుగాని.' అంది.

'తలనొప్పిగా వుందత్తయ్యా. ఇవాళ ఎక్కడికీ వెళ్ళాలని లేదు.' అంది సరళ కణతలు ఒత్తుకుంటూ.

తరువాత ముగ్గురూ కూర్చుని ఫలహారం చేస్తుండగా సావిత్రమ్మ 'సరళ రేపే వెళ్ళిపోతానంటోంది, నేనూ సరే అన్నాను. రేపు తప్పితే మళ్ళీ నాలుగురోజులదాకా మంచిరోజులు కూడ లేవు' అంది.

క్రీగంట సరళవంక చూసిన మోహన్‌కి ఆ అమ్మాయి మొహంలో_ ఏ భావమూ

వ్యక్తంకాలేదు. ఆ సమయంలో తల్లి ఎదురుగా ఆ అమ్మాయిని పలకరించాలంటే కూడ అతనికి ఎలాగో అనిపించి మౌనంగా వుండిపోయాడు.

నలుగురి బయటా కూడా సావిత్రమ్మే ఏదేదో మాట్లాడేస్తోంది.

ఫలహారాలు పూర్తయ్యాయి. మోహన్ లేచి గదిలోకి వెళ్ళిపోయాడు.

'ఇంక సరళ రేపు సాయంకాలం వెళ్ళిపోతుంది. రేపు ఉదయం లేచిన దగ్గర నుండీ తనకి ఒకటే హడావిడి. ఈ రాత్రిలోగా సరళని ఏకాంతంగా కలుసుకుని, నాలుగుమాటలు మాట్లాడాలి.' అని అతని మనస్సు పురికలు వేస్తోంది. కాలక్షేపానికి చేతిలోకి తీసుకున్న పుస్తకం పుటలు తిరగ వేస్తూ సరళతో ఏం చెప్పాలి, తన ఇన్నాళ్ళ విముఖానికి ఎలా క్షమార్పణ చెప్పుకోవాలి అని ఆలోచిస్తున్నాడు.

సాయంకాలం గడిచి రాత్రి అయింది. భోజనాలు ముగించి అంతా నిద్రలకి వుప క్రమించే వేళకూడ అయింది. కాని మోహన్ కోరుకున్న సమయం మాత్రం రాలేదు.

తెల్లవారింది మోహన్ లేబరేటరీకి వెళ్ళే వేళ అయింది. అతను భోజనం ముగించి టవల్‌తో చేతులు తుడుచుకుంటూ ఇవతలకి వచ్చాడు. మధ్యగదిలో జడ అల్లుకుంటూ నిలబడివుంది సరళ. సావిత్రమ్మ పెరట్లో, పక్కింటావిడతో మాట్లాడుతోంది.

తిన్నగా అతనిగదిలోకి వెళ్ళిపోతాడు అనుకున్న మోహన్ తనదగ్గరగా వచ్చి నిలబడటంతో సరళ ఒక్కక్షణం తొట్రుపడి తనూ పెరటిలోకి వెళ్ళిపోవాలనుకుంది అది కనిపెట్టిన మోహన్, 'నన్ను చూస్తే భయం వేస్తోందా ఏమిటి. అలా దూర దూరంగా పారిపోతున్నావు' అన్నాడు నవ్వుతూ.

'ఊహూ — భయం ఎందుకూ?' సరళ కూడ నవ్వేస్తూ సమాధానం చెప్పింది. అయితే ఆ అమ్మాయి ఎన్నడూలేని బిడియంతో సంకోచంతో ముడుచుకుపోతోందని మోహన్‌కి కూడ అర్థం అయింది — అది వరకుదాకా ఎంత చనువుగా తిరిగిన వ్యక్తి అయినా తీరా పెళ్ళి నిశ్చయం అయింది అనేసరికి ఆడపిల్లలకి ఎక్కడలేని సిగ్గు ముంచుకు వస్తుంది కాబోలు అనుకుంటూ నవ్వుకున్నాడు.

'నేను నిన్నటినుండీ, నీతో నాలుగు మాటలు మాట్లాడాలని ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నాను. నువ్వేమో కావాలనే నన్ను తప్పించుకుని తిరుగుతున్నావు కదూ' అతని నిష్ఠూరంతోకూడిన ఆప్యాయత తొణికిసలాడింది.

ఏదోవంక పెట్టుకుని అక్కడ్నించి వెళ్ళిపోవాలనుకున్న సరళ ఆమాటలతో ఆగిపోయి 'నేనా, అబ్బే అదేం లేదే' అంది చిన్నగా నవ్వుతూ.

'సరేలే — నాకు టైమయిపోయింది. వెళ్తున్నాను. నేను మళ్ళీ వచ్చేసరికి రైలు టైమూ అవుతుంది. నువ్వు రెడీగా వుండు ... మరి వెళ్ళగానే వుత్తరం వ్రాస్తావా...' అని అతను అడుగుతూంటే 'వ్రాస్తాను' అన్నట్లు తల వూగించింది.

ఆ తరువాత ఏదో చెప్పాలనుకుని, అది ఎలా చెప్పాలో తెలియనివాడిలా తటపటాయిస్తూ ఒక్కక్షణం నిలబడిపోయాడు మోహన్.

'స్టౌమీద పాలు పెట్టాను. పొంగుతున్నాయేమో చూసి స్టౌ ఆర్పేయమ్మా' పెరట్లోంచి సావిత్రమ్మ కంఠం వినిపించింది. అలాంటి అవకాశం కోసమే చూస్తున్నదానిలా వంటగదిలోకి తుర్రుమంది సరళ.

మోహన్ నిట్టూర్చి ఒకసారి చూసుకుని, స్కూటరు స్టార్టుచేసుకుని లేబరేటరీకి వెళ్ళిపోయాడు.

సాయంకాలం సరళని రైలు ఎక్కించి వచ్చిన దగ్గరనుండీ సావిత్రమ్మ అన్నగారి వుత్తరం కోసమూ, మోహన్ సరళ వుత్తరం కోసమూ ఎదురుచూస్తూ నిమిషాలు, గంటలూ లెక్కపెట్టుకోసాగారు.


* * *

మూడురోజుల తరువాత సాయంకాలం మోహన్ లేబరేటరీనుండి రాగానే, అంత క్రితమే పోస్టుమేన్ ఇచ్చివెళ్ళిన కవరు అందించి అవతలికి వెళ్ళిపోయింది సావిత్రమ్మ. అది సరళ వ్రాసిన వుత్తరం అని ఆవిడకి తెలుసు. కాబోయే భార్య వ్రాసిన ప్రేమలేఖ చదువుకుంటూ తన్మయత్వంతో మురిసిపోయేవేళ, కొడుకు ఎదురుగా నిలబడి అతని మొహంలో కళ్ళలో ప్రతిఫలించే భావాలని చదవటం సభ్యత కాదనిపించిందా విడకి.

వెళ్ళిపోతున్న తల్లినంక ఒక్కసారి చూసి హుషారుగా కుర్చీలో కూర్చుని వుత్సాహంగా కవరుచించి కాగితాలు పైకి తీశాడు మోహన్.

బావా,

నిన్న ఉదయం నేను ఇక్కడ క్షేమంగా చేరాను. నువ్విచ్చిన టెలిగ్రాం అందుకుని నాన్నగారు స్టేషనుకి వచ్చారు, ఇంటికి రాగానే పెట్టితీసి, నువ్వు మామ్మానికీ మామతికీ కొనియిచ్చిన బహుమతులు తీసి ఇచ్చాను. వాళ్ళు పొంగిపోయారు. అత్తయ్య చేసి ఇచ్చిన పిండివంటలు చూసి అమ్మ సంబరంగా బుగ్గలు నొక్కుసుకుంది, ఇలా



# నేను మహాపాపాలు...

కొన్నేళ్ళు గడచిన తరువాత అమ్మా నాన్న గారు ఆసక్తిగా కుతూహలంగా నా సంక్షేమాన్నీ నేను చెప్పబోయే శుభవార్త కోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని కూర్చుండి పోయారని నేను గ్రహించుకున్నాను. అయినా ఏమీ చెప్పాలనిపించలేదు. నా స్నానం భోజనం అయ్యాయి. ఇంతలో వచ్చింది. అత్తయ్య వ్రాసిన ఉత్తరం. పోస్టు బంట్రోతు చేతిలోనుండి అందు కున్న ఉత్తరం పూర్తిగా చదవకుండానే నాన్నగారి కళ్ళల్లోకి మొహంలోకి ఒక అపురూపమైన ఆనందం పొంగుకు వచ్చింది. అప్పటికప్పుడే అమ్మని పిలిచి ఆ శుభవార్త చెప్పేశారు. అమ్మ పొంగిపోతూ సంబరంగా నా బుగ్గలు నిమిరి, 'ఇది సిగ్గుతోనే ఏమీ చెప్పకపోయినా దాగని దీని మొహం చూడ గానే నాకు కనిపించింది. పెళ్ళికళ వచ్చే సిందని' అంది.

వాళ్ళ ఆర్భాటం అంతా చూస్తుంటే నాకు వేడుకా విసుగూ కలిగాయి. అదేమిటి అని నువ్వు ఆశ్చర్యపోవచ్చు. అందుకే నా మనస్సులోని సంగతులు నీ ముందు విప్పాను.

ఊహ తెలిసినప్పటినుండి నేను నిన్ను ఆరాధించినమాట యదార్థమే. అప్పట్లో నువ్వుకూడ నేనే నీ సర్వస్వం అన్నట్లు వుండేవాడివి. ఆ రోజుల్లోనే మన వివాహం జరిగిపోయి వుంటే బాగుండేది, కాని జరగలేదు.

ఇంతలో నువ్వు వుద్యోగంకోసం హైదరాబాదు వెళ్ళిపోయావు. అక్కడికి వెళ్ళిన తరువాత నీలో ఏదో మార్పు వచ్చింది అని మాకందరికీ అనిపించ సాగింది. క్రమంగా. అయితే అది కేవలం మేము అనుకోటమే కాదని నువ్వు నిజంగా మారిపోయావని నేను మొన్న ఇక్కడ వచ్చినప్పుడు కొంత గ్రహించుకున్నాను. మిగిలినది నువ్వూ అత్తయ్యా మాట్లాడుతున్న దానినిబట్టి అర్థం చేసుకున్నాను.

సంవత్సరాల తరబడి పెంచుకున్న అనురాగాన్నీ అనుబంధాన్నీ పెద్దల గౌరవాలనే తెంచేసుకుని మాలతినే ప్రాణాధికంగా ప్రేమించసాగావు నువ్వు. అంతేకాదు పెంచుకున్న ప్రేమ లత పుష్పించి ఫలించబోతుంది అన్న తరుణంలో అత్తయ్య తిరస్కారాన్ని

మన చిన్ననాటి సంగతులన్నీ మాలతి చెవిని వేసింది — మాలతి అంతే ప్రత్యేకమయిన ఉన్నత ఏమీ లేకపోయినా నా పట్ల మా కుటుంబంపట్ల ఆమెకిగల అభిమానమూ అనుబంధమూ ఆమెచేత అలా చేయించాయి. సరే — అత్తయ్య మాటలు మాలతి మనస్సులో సహజంగానే అలజడిని రేపాయి. అయినా చాలామందిలాగా మాలతి స్వార్థానికి ప్రలోభానికి లొంగిపోలేదు. నువ్వు తనని నాకంటె మిన్నగా ప్రేమిస్తున్నావు అని తెలిసికూడ నీదారినుండి తప్పుకోటానికే నిశ్చయించుకుంది. నువ్వు బతిమాలినా ప్రాధేయపడినా ఆమె తన మనస్సు మార్చుకోలేదు. చివరికి నువ్వే ఆమె నిర్ణయానికి కట్టుబడిపోయావు.

తను మనసారా కోరుకుంటున్న వ్యక్తిని మరొకరికోసం త్యాగం చెయ్యగలగటం అది ఒక అపురూపమైన త్యాగమే. అలా చేయటం అందరికీ సాధ్యంకాదు.

నిజంగా మాలతి అపురూపమైన వ్యక్తి. ఆమె ఔన్నత్యాన్ని నేను మెచ్చుకుంటు న్నాను, అంతేకాదు ఆమె ఔన్నత్యాన్ని అర్థం చేసుకుని ఆమె త్యాగాన్ని అందుకోగలిగే అంత ఎత్తుకి నేను పెరగలేను.

నాకు జ్ఞానం వచ్చిన దగ్గరనుంచీ నిన్నే ఆరాధిస్తూ వస్తున్నా, ఆ ఆరాధన వెనక వున్న కోరికకి ప్రేమకి నిర్వచనం ఇవాళ చెప్తున్నాను. నా భర్త నిండు మనస్సుతో నన్ను ప్రేమించాలని నన్నే తన సర్వస్వంగా భావించాలని నా కోరిక. ఇందులో ఇంకొకరి జోక్యంగాని, మరొకరి ప్రభావం గాని నేను సహించలేను.

ఒకరు ఒక వ్యక్తిని మనసారా కోరుకుని తన స్వంతం చేసుకోబోతున్న తరుణంలో ఏవేవో సంఘటనలు, ఆగ్రహాలు అడ్డు నిలిచి ఆ వ్యక్తి తప్పుకోవటం అతను ఆ త్యాగాన్ని శ్లాఘిస్తూ మరొకరితో వివాహానికి అంగీకరించటం, ఆ పెళ్ళికూతుర్ని నేను కావటం అది నేను భరించలేను — ఎవరిదో సొమ్ము, ఈ జీవితం ఇంకొకరి త్యాగఫలం, ఈ బ్రతుకు ఎవరో కరుణా ధర్మంగా ప్రసాదించినది అన్న స్పృహ నన్ను జీవితాంతం గుచ్చుతుంది ఆ బాధను నేను భరించలేను. ఇది చదువుతూంటే

నన్ను ఒక మూర్ఖురాలిగా స్వార్థపరురాలిగా నువ్వు అంచనా వేసుకుంటూ వుండవచ్చు. అయినా నాకేమీ చింతలేదు.

నువ్వూ మాలతీ భాగ్యవంతులు కావాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇంక నా పెళ్ళిసంగతంటావా — నాన్నగారి శక్తికి తగినట్లు ఏదో ఒకటి దొరక్కపోదు. ఈ మధ్య నువ్వు పెళ్ళివిషయంలో ముభావంగా వుంటూండగానే రోజుల్లో నాన్నగారు నాకో సంబంధం చూశారు. పెళ్ళిచూపులదాకా రాలేదుకాని మిగిలిన విషయాలన్నీ బాగానే వున్నాయి, మనోడుపంతులు ఆ సంబంధమే ఖాయం కావచ్చు. అదికాకపోతే మరొకటి అవుతుంది. నా పెళ్ళిని గురించి నాకేం దిగులు లేదు. మా కుటుంబంపట్ల కృతజ్ఞత చూపించుకోలేక పోతున్నావని నువ్వేమీ బాధపడకు. అలాంటి అభిప్రాయం మాకెవరికీ లేదు.

అత్తయ్యకి నమస్కారాలు. మాలతిని అడిగానని చెప్పు. మీ పెళ్ళికి ముహూర్తం పెట్టుకోగానే ఉత్తరం వ్రాయి. మేమంతా వస్తాము.

నా నిర్ణయం అమ్మా నాన్నగారికి చెప్పినప్పుడు వాళ్ళు మొదట ఆశ్చర్యపడినమాట ఆ తరువాత బాధపడినమాటాకూడ నిజమే. అయితే మరొకరు ధారాదత్తం చేసిన అదృష్టాన్ని నేను అందుకోలేను. అంతటి ఔన్నత్యం నాలో లేదు. నేను మామూలు మనిషిని నన్ను క్షమించండి అని నేను ప్రాధేయపడి నప్పుడు వాళ్ళు నన్ను అర్థంచేసుకున్నారు. నువ్వుకూడ నన్ను అర్థంచేసుకో.

సరళ,

ఉత్తరంలో ఒక్కొక్క వాక్యమే చదువు తున్న కొద్దీ సరళ నిర్ణయం, ఆమె మనస్సు మరో అర్థం అయిన మోహన్‌కి ఆమె పట్ల కోపం రాలేదు. అపూర్వమైన గౌరవం ఆప్యాయత కలిగాయి.

ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ పర ధ్యానంగా కాగితాలు మడత పెడుతూ కూర్చున్న మోహన్, చాలాసేపటి తరువాత,

"ఏం వ్రాసిందిరా సరళ" అన్న తల్లి మాట వినిపించి లేచివెళ్ళి, ఉత్తరం మడత ఆమెచేతికి అందించాడు.

(అయిపోయింది)